రోడ్ల మరమ్మతులకు నిధులు కరువు

- ఇబ్బందుల్లో వాహనదారులు
- పట్టించుకోని అధికారులు

మోర్తాడ్: మండలంలోని తిమ్మాపూర్‌-కమ్మర్‌పల్లి మధ్య ఉన్న రోడ్డు చాలా అధ్వానంగా మారింది. వాహనదారుల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుండటంతో పాటు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. గత ప్రభుత్వ హయాంలో రోడ్డు పునర్‌ నిర్మాణానికి రూ.1.50 కోట్లు మంజూరు చేసి పనులకు శంకుస్థాపన చేశారు. వద్యాట్‌, కమ్మర్‌పల్లి మధ్య ఉన్న రోడ్డు కూడా పూర్తిగా దెబ్బతింది. వర్షాకాలంలో ఈ మార్గంలో రాకపోకలు సాగించడం కష్టమవుతుంది. అలాగే ఉప్లూర్‌, తిమ్మాపూర్‌ మధ్య ఉన్న రోడ్డు పరిస్థితి ఇలాగే ఉంది. ఇది ఒక్క తిమ్మాపూర్‌, ఉప్లూర్‌, వద్యాట్‌, కమ్మర్‌పల్లిల గ్రామీణ రోడ్ల పరిస్థితే కాదు జిల్లాలో అనేక చోట్ల ఉన్న పంచాయతీరాజ్‌ శాఖ పరిధిలోని రోడ్లు ధ్వంసమై పరిస్థితి అధ్వానంగా మారింది. ప్రభుత్వం జిల్లాలోని వివిధ గ్రామీణ రోడ్లను కొత్తగా నిర్మించడానికి ఇటీవల రూ.55 కోట్లను మంజూరు చేసింది. గ్రామీణ రోడ్లను కొత్తగా నిర్మించడానికి జిల్లాలోని బాల్కొండ, ఆర్మూర్‌, బోధన్‌, నిజామాబాద్‌ రూరల్‌, బాన్సువాడ నియోజకవర్గ పరిధిల్లోని గ్రామాలకు రూ.55 కోట్లు మంజూరు చేశారు. ఈ నిధులతో 81.15 కిలోమీటర్ల రోడ్లను నిర్మించనున్నారు. ఇప్పటికే నిర్మించిన అనేక రోడ్లు ధ్వంసం కాగా ఇప్పటి వరకు మరమ్మతులకు నోచుకోలేదు. రోడ్లు భవనాల శాఖ పరిధిలోని రోడ్ల మరమ్మతులకు ప్రతి నాలుగేళ్లకోసారి నిధులు మంజూరు అవుతున్నాయి. పంచాయతీరాజ్‌ శాఖ పరిధిలో ఉన్న రోడ్ల మరమ్మతులకు షెడ్యూల్‌ ప్రకారం నిధులు విడుదల కావడం లేదు. గత ప్రభుత్వంలో జరిగిన నిర్లక్ష్యం ఈ ప్రభుత్వం చేయకూడదని పలువురు సూచిస్తున్నారు. కొత్త రోడ్ల నిర్మాణంపై దృష్టి సారించిన ప్రభుత్వం గతంలో నిర్మించిన రోడ్ల మరమ్మత్తులపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.


తిమ్మాపూర్‌-కమ్మర్‌పల్లి మధ్య దెబ్బతిన్న రోడ్డు

మరమ్మతులకు నిధులివ్వాలి



గ్రామీణ రోడ్ల మరమ్మతులకు నిధులు విడుదల చేయాలి. అనేక చోట్ల రోడ్లు ధ్వంసమై ఇబ్బందులు కలుగుతున్నాయి. ప్రభుత్వం ఆలోచన చేసి రోడ్ల మరమ్మతులకు పెద్ద మొత్తంలో నిధులు కేటాయిస్తే అన్ని చోట్ల రవాణాకు ఇబ్బందులు తొలగుతాయి.

– తోకల నర్సయ్య, మాజీ సర్పంచ్‌, తాళ్లరాంపూర్‌

ప్రతిపాదనలు పంపించాం

గ్రామీణ రోడ్ల మరమ్మతులకు నిధులు విడుదల చేయాలని ప్రతిపాదనలు పంపించాం. తాజాగా కొత్త రోడ్ల నిర్మాణానికి నిధులు విడుదల చేశారు. త్వరలోనే మరమ్మతులు చేయడానికి నిధులు మంజూరయ్యే అవకాశం ఉంది. అంచనాలు వేసి నిధుల మంజూరు కోసం ప్రతిపాదనలు పంపించాం.

– బావయ్య, ఈఈ పంచాయతీరాజ్‌ శాఖ

క్లుప్తంగా

సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలి



ఆర్మూర్‌టౌన్‌: ప్రతి కార్యకర్త పార్టీ సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధులు జెస్సు అనిల్‌, కలిగోట గంగాధర్‌ అన్నారు. పట్టణ కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీజేపీ దేశ వ్యాప్తంగా ప్రాథమిక సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహిస్తుందని, అందులో భాగంగా క్రియాశీల సభ్యత్వాన్ని సైతం నిర్వహించాలని పార్టీ ఆదేశాలు జారీ చేసిందన్నారు. కార్యక్రమంలో నాయకులు ద్యాగ ఉదయ్‌, పాల్కం వేణు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఫ్యాక్టరీని సందర్శించడంపై హర్షం

బోధన్‌: నిజాంషుగర్‌ ఫ్యాక్టరీ పునరుద్ధరణకు ప్రభుత్వం సానుకూల దృక్పథంతో ఉన్న నేపథ్యంలో స్థానిక ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అధికారులతో కలిసి సందర్శించడం శుభదాయకమని ఎన్‌డీఎస్‌ఎల్‌ కార్మిక సంఘాల నాయకుడు నాగేశ్వర్‌రావు, పలువురు కార్మికులు బుధవారం హర్షం వ్యక్తం చేశారు. నియోజకవర్గ పర్యటనలో ఎమ్మెల్యే ఫ్యాక్టరీ పునరుద్ధరణ అంశాన్ని ప్రతి చోట ప్రస్తావిస్తూ చెరుకు సాగుకు రైతులు ముందుకు రావాలని సూచిస్తున్నారని పేర్కొన్నారు. ఫ్యాక్టరీ యంత్రాల మరమ్మతుల కోసం కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని, ఇప్పటి వరకు కార్మికులకు రావాల్సిన నెలసరి వేతన బకాయిలు చెల్లించేందుకు కృషి చేయాలని ఎమ్మెల్యేను కోరారు.

సభను విజయవంతం చేయాలి



బోధన్‌: ఆర్మూర్‌లో నవంబర్‌ 9న నిర్వహించే ప్రజాపంథా సిద్ధాంత మార్గదర్శకుడు డీవీకే (దుర్గంపూడి వెంకట కృష్ణ) విగ్రహావిష్కరణ సభకు ప్రజలకు తరలి రావాలని సీపీఐ(ఎంఎల్‌) మాస్‌లైన్‌ డివిజన్‌ సహాయ కార్యదర్శి మల్లేశ్‌ కోరారు. పట్టణ కేంద్రంలోని హెడ్‌ పోస్టాఫీసు ప్రాంతంలో విగ్రహావిష్కరణ సభకు సంబంధించిన వాల్‌ పోస్టర్లను కార్యకర్తలతో కలిసి బుధవారం ఆవిష్కరించారు. నాయకులు పడాల శంకర్‌, సాయిలు, ఊశయ్య, పోశెట్టి, శంకర్‌, వాహీద్‌, మైబూబ్‌, లక్ష్మణ్‌ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాదుస్తుల వితరణ



వేల్పూర్‌: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో 50 మంది విద్యార్థులకు స్థానిక గ్రామ కమిటీ తరపున క్రీడా దుస్తులను బుధవారం వితరణ చేశారు. వచ్చే నెల 12 నుంచి మోతె హైస్కూల్‌లో నిర్వహించే మండల స్థాయి క్రీడల్లో పాల్గొనేందుకు విద్యార్థులు క్రీడా దుస్తులను అందజేశారు. దీంతో వీడీసీ కార్యవర్గానికి హెచ్‌ఎం రాజన్న కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వీడీసీ అధ్యక్షుడు పురుషోత్తం, కార్యదర్శి మహేశ్‌, క్యాషియర్‌ నరేందర్‌, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎల్‌వోసీ అందజేత

కమ్మర్‌పల్లి: మండలంలోని ఉప్లూర్‌కు చెందిన యేల్ల చిన్నుబాయి వెన్నుపూస నొప్పితో బాధపడుతూ చికిత్స కోసం హైదరాబాద్‌లోని నిమ్స్‌లో చేరారు. పరీక్షలు నిర్వహించిన వైద్యులు శస్త్రచికిత్స అవసరం కాగా, వైద్య ఖర్చుల నిమిత్తం కాంగ్రెస్‌ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి సునీల్‌రెడ్డి బాధితుల విన్నపం మేరకు సీఎం సహాయ నిధి నుంచి రూ. 2.50 లక్షల ఎల్‌వోసీని మంజూరు చేయించారు. దీంతో బాధిత కుటుంబీకులకు ఎల్‌వోసీని స్థానిక కాంగ్రెస్‌ నాయకులు అందజేశారు.

రంగోత్సవ్‌లో విద్యార్థుల ప్రతిభ

మోర్తాడ్‌: ఇటీవల నిర్వహించిన రంగోత్సవ్‌ వేడుకల్లో మండలంలోని సుంకెట్‌ తండా విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. బంగారు, వెండి, కాంస్య పతకాలను సవిత, అశ్విత, అభిగ్న సాధించగా వారిని పాఠశాలలో హెచ్‌ఎం దండు గంగాధర్‌ అభినందించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ ఉపాధ్యాయురాలు శృతి, వీడీసీ సభ్యులు వినోద్‌, నరేశ్‌ పాల్గొన్నారు.

పేదలకు పటాకుల పంపిణీ

ఆర్మూర్‌టౌన్‌: పట్టణంలో లయన్స్‌ క్లబ్‌ ఆఫ్‌ ఆర్మూర్‌ నవనాథపురం ఆధ్వర్యంలో దీపావళి పండుగను పురస్కరించుకొని పేదలకు పటాకులు అందజేశారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రంలో ఉన్న చిన్నారులకు, కెనాల్‌ కట్టపై నివాసం ఉంటున్న పేద కుటుంబాలకు పటాకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్‌ క్లబ్‌ అధ్యక్షుడు చెరుకు పృథ్వీరాజ్‌, సభ్యులు అంబల్ల తిరుపతి, చెన్న రవికుమార్‌, గుర్రం విజయానంద్‌, శశిధర్‌రెడ్డి పాల్గొన్నారు.

గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ప్రారంభం


ఆర్మూర్‌లో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ వన్నెల్‌దేవి లావణ్య


తాడ్‌బిలోలిలో కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఆగ్రో ఇండస్ట్రీస్‌ డీలర్‌ మౌలానా

నవీపేట/ రెంజల్‌/ కమ్మర్‌పల్లి/ మోర్తాడ్‌/ ఆర్మూర్‌టౌన్‌: జిల్లాలోని పలు గ్రామాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే, పలువురు ప్రజాప్రతినిధులు బుధవారం ప్రారంభించారు. నవీపేట మండలంలోని నాగేపూర్‌లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బోధన్‌ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో నిజామాబాద్‌ ఏఎంసీ వైస్‌ చైర్మన్‌ జంగిటి రాంచందర్‌, సొసైటీ చైర్మన్‌ శైలేష్‌కుమార్‌, నాయకులు శ్రీనివాస్‌గౌడ్‌, కిషన్‌రావు, సాయరెడ్డి, గోపాల్‌, భగవాన్‌, బాబు, రైతులు పాల్గొన్నారు

రెంజల్‌ మండలంలోని పలు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను వారు ప్రారంభించారు. ఆగ్రో ఇండస్ట్రీస్‌ ఆధ్వర్యంలో తాడ్‌బిలోలిలో నీలా, దూపల్లి సహకార సంఘాల చైర్మన్లు ఇమాం బేగ్‌, భూంరెడ్డి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఆగ్రో డీలర్‌ మౌలా నా, రైతులు సుధాకర్‌రావు, గంగాకృష్ణ, రాజు, శ్రీనివాస్‌, ఖుద్దూస్‌, బాబునాయక్‌, కార్యదర్శులు రాందాస్‌, జీవన్‌రెడ్డి పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి మండల కేంద్రంలో స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పా టు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాన్ని చైర్మన్‌ రేగుంట దేవేందర్‌, ఏఎంసీ చైర్మన్‌ నర్సయ్య ప్రారంభించారు. ఏవో రమ్యశ్రీ, ఏఈవో రమేశ్‌, సీఈవో శంకర్‌, ఏఎంసీ వైస్‌ చైర్మన్‌ సుంకెట బుచ్చన్న, నాయకులు వచ్చి మల్లయ్య, కొత్తపల్లి రఘు, మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భీమ్‌గల్‌ మండలంలోని ముచ్కూర్‌ సహకార సంఘం ఆధ్వర్యంలో పిప్రి, బాచన్‌పల్లి, ముచ్కూర్‌, పల్లికొండ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ పాలెపు నర్సయ్య ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్‌ చైర్మన్‌ సుంకెట బుచ్చన్న, ముచ్కూర్‌ పీఏసీఎస్‌ చైర్మన్‌ దేవేందర్‌, వైస్‌ చైర్మన్‌ గంగారెడ్డి, కాంగ్రెస్‌ పార్టీ మండల అధ్యక్షుడు బొదిరె స్వామి పాల్గొన్నారు.

ఆర్మూర్‌ మున్సిపల్‌ పరిధిలో ప్రభు త్వ డిగ్రీ కళాశాల వద్ద, పెర్కిట్‌ శివాలయం వద్ద ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ వన్నెల్‌దేవి లావణ్య ప్రారంభించారు. తహసీల్దార్‌ గజానన్‌, మున్సిపల్‌ కమిషనర్‌ రాజు, వైస్‌ చైర్మన్‌ షేక్‌ము న్నూ, కౌన్సిలర్లు ఆకుల రాజు, ఫయాజ్‌, టీఎంసీ ఉదయ్‌శ్రీ, మహిళ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

పొగాకు బట్టీలను నియంత్రించాలి

రెంజల్‌: పొగాకు బట్టీలను నియంత్రించాలని కోరుతూ మండలంలోని కందకుర్తి గ్రామస్తులు తహసీల్దార్‌ శ్రావణ్‌కుమార్‌కు బుధవారం వినతిపత్రం అందించారు. గ్రామాలకు ఆనుకుని పొగాకు బట్టీలను రైతులు ఏర్పాటు చేయడం వల్ల వాయు కాలుష్యం ఏర్పడి పిల్లలు, వృద్ధులు, మహిళలు క్యాన్సర్‌ రోగాల బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే పలువురు క్యాన్సర్‌తో మృతి చెందారని వినతిపత్రంలో పేర్కొన్నారు. గ్రామానికి దూరంగా బట్టీలను ఏర్పాటు చేసుకునేలా చర్యలు తీసుకునాలని కోరారు. కందకుర్తి, బోర్గాం, నీలా గ్రామాల్లో ఇంటి పరిసరాలకు ఆనుకుని రైతులు బట్టీలను ఏర్పాటు చేయడంతో వ్యాధిగ్రస్తులు పెరుగుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. బట్టీల నివారణకు సహకరించాలని కోరారు.


తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న కందకుర్తి గ్రామస్తులు

పాఠశాలల్లో దీపావళి వేడుకలు


జెంటిల్‌ కిడ్స్‌ పాఠశాలలో..


పెర్కిట్‌ శ్రీ భాషిత పాఠశాలలో..


మామిడిపల్లి లిల్లిపుట్‌ పాఠశాలలో..

పెర్కిట్‌/ ఆర్మూర్‌టౌన్‌: ఆర్మూర్‌ మండలంతో పాటు మున్సిపల్‌ పరిధిలోని పెర్కిట్‌, మామిడిపల్లి ప్రైవేటు పాఠశాలల్లో దీపావళి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. మామిడిపల్లి నలంద హైస్కూల్‌, లిల్లిపుట్‌ పాఠశాల, పెర్కిట్‌ శ్రీ భాషిత, కాంతి పాఠశాలలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాల్లో ఆయా పాఠశాలల కరస్పాండెంట్లు, ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు. పట్టణంలోని జెంటిల్‌కిడ్స్‌ పాఠశాలలో దీపావళి పండుగను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల కరెస్పాండెంట్‌ గుజరాతి ప్రకాశ్‌, ప్రిన్సిపాల్‌ లతా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నమ్మించి మోసం చేశాడని ఆందోళన



రుద్రూర్‌: నమ్మించి మోసం చేసిన ఓ ప్రియుడి ఇంటి ఎదుట ప్రియురాలు ఆందోళన చేపట్టిన ఘటన రుద్రూర్‌ మండలం బొప్పాపూర్‌లో చోటు చేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్‌ స్కూల్‌లో టీచర్‌గా పని చేస్తున్న పౌజియాకు ఐదు నెలల క్రితం రుద్రూర్‌ మండలం బొప్పాపూర్‌కు చెందిన ముజీబ్‌ పరిచయమయ్యాడు. మొదట స్నేహంగా మారిన వీరి పరిచయం తర్వాత ప్రేమగా మారింది. పెళ్లి చేసుకుంటానని నమ్మించి ముజీబ్‌ గర్భవతిని చేశాడు. పెళ్లి చేసుకోవాలని కోరితే తిరస్కరిస్తున్నాడు. గ్రామంలోని పెద్దమనుషులు, మహిళా సంఘాల సభ్యులకు, పోలీస్‌స్టేషన్‌లో సమస్యను విన్నవించినా సమస్య పరిష్కారం కావడం లేదని పౌజియా ముజీబ్‌ ఇంటి ఎదుట బుధవారం ఆందోళన చేపట్టింది. మొదట తనకు వివాహమై విడాకులు తీసుకున్న విషయం, ఇద్దరు పిల్లలు ఉన్నారనే విషయం తెలిసే ముజీబ్‌ తన వెంట పడి ప్రేమ పేరుతో నన్ను మోసం చేశాడని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేస్తోంది. అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని బాధిత కుటుంబీకులు కోరుతున్నారు.

పేకాట స్థావరంపై దాడి

బోధన్‌రూరల్‌: సాలూర మండల కేంద్రంలో పేకాటస్థావరంపై దాడి చేసినట్లు బోధన్‌ రూరల్‌ ఎస్సై మచ్చేందర్‌ రెడ్డి తెలిపారు. పేకాట ఆడుతున్న ముగ్గురిని అరెస్ట్‌ చేసి వారి నుంచి రూ.1,390 నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

దొడ్డు రకం వడ్లకు బోనస్‌ ఇవ్వాలి

మాక్లూర్‌: రైతులు పండించిన దొడ్డు రకం వడ్లకు ప్రభుత్వం రూ. 500 బోనస్‌ ప్రకటించాలని కోరుతూ బుధవారం అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గంగాధర్‌ రైతులతో కలిసి డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. అలాగే కొనుగోలు కేంద్రాల్లో స్తంభించిపోయిన ధాన్యాన్ని కాంటాలు నిర్వహించేలా చూడాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. అబ్బయ్య, శివరాజ్‌,నరసయ్య,లక్ష్మణ్‌ ఉన్నారు.

సర్వేను పక్కాగా నిర్వహించాలి


మాట్లాడుతున్న సబ్‌ కలెక్టర్‌ వికాస్‌మహతో

బోధన్‌/ రెంజల్‌/ రుద్రూర్‌/ మోర్తాడ్‌/ వర్ని: సమగ్ర కుటుంబ సర్వేను పక్కాగా నిర్వహించాలని, ఎలాంటి తప్పిదాలకు చోటు ఇవ్వకూడదని బోధన్‌ సబ్‌ కలెక్టర్‌ వికాస్‌ మహతో అన్నారు. పట్టణ కేంద్రంలో బోధన్‌, సాలూర మండల స్థాయి సర్వే ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లకు సర్వేపై శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. సర్వే లక్ష్యాలు, విధివిధానాలపై దిశా నిర్దేశం చేశారు. తహసీల్దార్లు విఠల్‌, శశిభూషణ్‌, ఎంపీడీవో బాల గంగాధర్‌, ఏవో సంతోష్‌ పాల్గొన్నారు.

రెంజల్‌ మండలంలోని అంగన్‌వాడీ టీచర్లు, జీపీ కార్యదర్శులు, ఐకేపీ సిబ్బందికి తహసీల్దార్‌ శ్రావణ్‌కుమార్‌ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఒక్కరూ సమన్వయంతో సర్వే నిర్వహించాలని సూచించారు. ఎంపీడీవో వెంకటేశ్‌జాదవ్‌, డీఈఈ మున్నీనాయక్‌, ఏపీఎం చిన్నయ్య, ఏఈ వినయ్‌కుమార్‌, ఐసీడీఎస్‌ సూపర్‌వైజర్‌ ప్రమీలారాణి, రవి, ఎంపీవో రఫీయొద్దీన్‌ పాల్గొన్నారు.

కోటగిరి, రుద్రూర్‌ ఎంపీడీవో కార్యాలయాల్లో సోమవారం సామాజిక, ఆర్థిక సర్వేపై బుధవారం ఎన్యుమరేటర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్లు గంగాధర్‌, తారాబాయి, ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఏర్గట్ల మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో బుధవారం ఎన్యుమరేటర్‌లకు శిక్షణ ఇచ్చారు. సర్వేలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తెలుసుకోవాల్సిన అంశాలపై తహసీల్దార్‌ శ్రీలత ఆధ్వర్యంలో శిక్షణ శిబిరం చేపట్టారు.

వర్ని మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సర్వే సిబ్బందికి ఎంపీడీవో వెంకటేశ్‌ శిక్షణ శిబిరం నిర్వహించారు. నవంబర్‌ 6 నుంచి 20వ తేదీ వరకు కేటాయించిన గ్రామాల్లో సర్వే సిబ్బంది సర్వేను పూర్తి చేయాలని సూచించారు. తహసీల్దార్‌ సాయి లు, ఎంపీవో మారుతి, ఎంఈవో దుర్కి సాయిలు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు వేయించాలి

రుద్రూర్‌: ఆవు, గేదె జాతి పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు తప్పని సరిగా వేయించాలని కోటగిరి ఉమ్మడి మండల పశువైద్యాధికారి సురేష్‌ కుమార్‌ తెలిపారు. బుధవారం పోతంగల్‌ మండలం కొడిచర్లలో పశువులకు ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. వెటర్నరి అసిస్టెంట్‌ సుధీర్‌గౌడ్‌, సాయిలు, రాము, నగేశ్‌, పంచాయతీ కార్యదర్శి రాజేశ్వరి–ారులు పాల్గొన్నారు.

వడ్డేపల్లిలో పోలీసు కళాజాత

ఎడపల్లి: మండలంలోని వడ్డేపల్లిలో బుధవారం రాత్రి పోలీసు కళాజాత నిర్వహించినట్లు ఎస్సై వంశీకృష్ణారెడ్డి తెలిపారు. ఆన్‌లైన్‌ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. యువత గంజాయి, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. వాహనదారులు హెల్మెట్‌ ధరించాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్‌ పోటీలకు ఎంపిక


లక్ష్మిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు


మాక్లూర్‌: పోటీలకు ఎంపికైన విద్యార్థులతో నాయకులు, ఉపాధ్యాయులు

కమ్మర్‌పల్లి: మండలంలోని హాసాకొత్తూర్‌ జెడ్పీ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న ఎల్‌ లక్ష్మి అనే విద్యార్థిని రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్‌ పోటీలకు ఎంపికై నట్లు పీడీ మాధురి బుధవారం తెలిపారు. ఆర్మూర్‌ మండలం కల్లెడలో బుధవారం నిర్వహించిన జిల్లాస్థాయి హ్యాండ్‌బాల్‌ పోటీల్లో లక్ష్మి మంచి ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైందన్నారు. నవంబర్‌ 2 నుంచి మూడు రోజులపాటు ఆసిఫాబాద్‌లో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో లక్ష్మి పాల్గొంటుందని అన్నారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో లక్ష్మిని ఉపాధ్యాయులు అభినందించారు.

మాక్లూర్‌లో..


మాక్లూర్‌: రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్‌ పోటీలకు కల్లెడి ప్రభుత్వ పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎంపికైనట్టు ఇన్‌చార్జి హెచ్‌ఎం బుధవారం తెలిపారు. నవంబర్‌ 2, 3, 4వ తేదీల్లో ఆదిలాబాద్‌ జిల్లా ఆసిఫాబాద్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఎంపికైన కీడాకారులను పాఠశాలలో బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించి అభినందించారు. కార్యక్రమంలో విద్యాసాగర్‌, గంగా మోహన్‌, పింజా సురేందర్‌, రాజేశ్‌ ఉన్నారు.

సంక్షిప్తం

బీఆర్‌ఎస్‌ నాయకుల సంబురాలు

ఆర్మూర్‌టౌన్‌: పట్టణంలోని అంబేద్కర్‌చౌరస్తా వద్ద బీఆర్‌ఎస్‌ నాయకులు పటాకులు కాల్చి సంబురాలు చేపట్టారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్‌ పట్టణ అధ్యక్షుడు పూజ నరేందర్‌ మాట్లాడుతూ.. పదేళ్లలో అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్‌ ఏనాడు విద్యుత్‌ చార్జి పెంచలేదన్నారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌ పది నెలల్లోనే విద్యుత్‌చార్జీల పెంపు ప్రతిపాదనలను చేస్తే బీఆర్‌ఎస్‌ అడ్డుకుందని అన్నారు. ప్రజల పక్షాన బీఆర్‌ఎస్‌ పోరాటం చేస్తోందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు ఈగ గంగాధర్‌, మీర శ్రావణ్‌, అగ్గుక్రాంతి తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో మాజీ సర్పంచ్‌ మృతి



పెర్కిట్‌: ఆర్మూర్‌ మండలం అంకాపూర్‌ మాజీ స ర్పంచ్‌ గడ్డం రాజన్న(85) బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. అంకాపూర్‌కు చెందిన రాజన్న 18 ఏళ్ల పాటు సర్పంచ్‌గా పని చేశారు. తనదైన శైలిలో గ్రామాభివృద్ధికి పాటుపడి ప్రజల మన్ననలు పొందారు. గడ్డం రాజన్న ఆర్మూర్‌ ఎమ్మెల్యే రాకేశ్‌ రెడ్డికి మేనమామ. గడ్డం రాజన్న మృతితో అంకాపూర్‌లో విషాద చాయలు అలుముకున్నాయి.

ఉచిత కంటి వైద్య శిబిరం



రుద్రూర్‌: కోటగిరి మండల కేంద్రంలోని వినాయక నగర్‌ కాలనీలో బుధవారం లయన్స్‌ క్లబ్‌ కోటగిరి డైమండ్‌, తెల రవికుమార్‌ యువసేన ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. కంటి వైద్యుడు సతీశ్‌ 40 మందికి కంటి పరీక్షలు చేశారు. కార్యక్రమంలో లయన్స్‌ క్లబ్‌ అధ్యక్షుడు తెల్ల రవి కుమార్‌, హన్మంత్‌రావు పటేల్‌, కప్ప సంతోష్‌, మహరాజ్‌ సాయిలు, గంగాప్రసాద్‌ గౌడ్‌, కాయిపల్లి బుగ్గరాజు, రాజు, అమీర్‌, ఇమ్రాన్‌, మోచి గంగామణి, రమేశ్‌, హైమద్‌, పప్పుల యోగేష్‌, బర్ల అర్పిత్‌, మేత్రి గంగాధర్‌ పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల అందజేత



మోర్తాడ్‌: మోర్తాడ్‌ కవిత ఇండెన్‌ గ్యాస్‌ ఆధ్వర్యంలో నిర్వహించిన లక్కీడ్రా విజేతలకు బుధవారం డీలర్‌ అంబల్ల శ్రీనివాస్‌ బహుమతులను అందజేశారు. దీపావళి కానుకగా కొత్త కనెక్షన్లు తీసుకున్న వారిలో విజేతలుగా ఎంపిక చేయడానికి లక్కీ డ్రా నిర్వహించారు. ఏర్గట్లకు చెందిన హవీలకు బహుమతి లభించగా 25 గ్రాముల వెండి కాయిన్‌ను అందచేశారు. కార్యక్రమంలో ఇండియన్‌ ఆయిల్‌ కార్పొరేషన్‌ ఏరియా సేల్స్‌ మేనేజర్‌ దిలీప్‌ నాయక్‌, రాజువర్ధన్‌, సంపత్‌, సతీశ్‌, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానాలు

పెర్కిట్‌/ వేల్పూర్‌/ నందిపేట్‌: ఆర్మూర్‌ మండలం ఇస్సాపల్లి, అంకాపూర్‌ ప్రభుత్వ పాఠశాలల్లో ఉద్యోగ విరమణ పొందిన లింబాద్రి, పర్వీన్‌ సుల్తానాను ఎంఈవో రాజ గంగారాం ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు బుధవారం ఘనంగా సన్మానించారు. వేలూర్‌ మండలం పడగల్‌ ప్రైమరీ స్కూలు నుంచి ఇటీవల బదిలీపై వెళ్తున్న, బదిలీపై వచ్చిన ఉపాధ్యాయులను పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హెచ్‌ఎంలు, తోటి ఉపాధ్యాయులు బుధవారం సన్మానించారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా ఉద్యోగ విరమణ పొందిన నందిపేట్‌ మండల కేంద్రానికి చెందిన పోతు గణేశ్‌ను పూర్వ విద్యార్థులు బుధవారం ఘనంగా సన్మానించారు.

నందిపేట్‌: మండలంలోని వెల్మల్‌ తెలంగాణ దక్కన్‌ గ్రామీణ బ్యాంకు నుంచి బదిలీపై వెళ్లిన మోహన్‌తో పాటు ఉద్యోగ విరమణ పొందిన జి గోవర్ధన్‌ను బ్యాంకు సిబ్బంది బుధవారం ఘనంగా సన్మానించారు. బ్యాంకు మేనేజర్‌ శివకృష్ణ, బ్యాంకు సిబ్బంది, ఖాతాదారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మోర్తాడ్‌: వరంగల్‌లో నిర్వహించిన 68వ ఎస్‌జీఎఫ్‌ రాష్ట్ర స్థాయి జూడో పోటీల అబ్జర్వర్‌గా వ్యవహరించిన భీమ్‌గల్‌ మండలం జాగిర్యాల్‌కు చెందిన అనితను బుధవారం సత్కరించారు. పోటీల్లో నిజామాబాద్‌కు మూడో స్థానం లభించింది. పలువురు ఆమెకు అభినందనలు తెలిపారు.

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్‌

పీవీఆర్‌ మల్టీప్లెక్స్‌ (ఆర్మూర్‌)

- స్క్రీన్‌-1 – నరుడు బ్రతుకు నటన-12.45,6.50; పొట్టెల్‌(తెలుగు)-3.40,9.45
- స్క్రీన్‌-2 – వెనమ్‌ ది లాస్ట్‌ డ్యాన్స్‌ (తెలుగు-3డీ)-11.15,1.50,4.25, 7.00,9.35
- స్క్రీన్‌-3 – జనక అయితే గనక (తెలుగు)-1.00; లగ్గం(తెలుగు) - 4.00,10.20; వేట్టయన్‌ (తెలుగు)-6.50
- స్క్రీన్‌-4 – దేవర (పార్ట్‌-1) - 11.35 6.25; విశ్వం (తెలుగు)-3.10; జనక అయితే గనక(తెలుగు)-10.00

ఉషా ప్రసాద్‌ మల్టీప్లెక్స్‌ (గీతా ఏషియన్‌)

- స్క్రీన్‌-1 లక్కీ భాస్కర్‌ (తెలుగు) - 10.40,1.35 4.35,7.30, 10.30
- స్క్రీన్‌-2 బఘీర (తెలుగు) -10.25 7.40; క (తెలుగు) - 1.25 10.40; అమరన్‌ (తెలుగు) -4.20
- స్క్రీన్‌-3 అమరన్‌ (తెలుగు) -10.05 1.20 7.20 10.30 క (తెలుగు) -4.30



పీవీఆర్‌ మల్టీప్లెక్స్‌ (వేణు మాల్‌)

- స్క్రీన్‌-1 అమరన్‌ (తెలుగు)-10.00 7.20 10.50 క (తెలుగు)-1.30; వెనమ్‌ ది లాస్ట్‌ డ్యాన్స్‌ (3డీ ఇంగ్లీష్‌)-4.45
- స్క్రీన్‌-2 లక్కీ భాస్కర్‌ (తెలుగు)-9.45, 1.00 4.15, 7.30, 10.45
- స్క్రీన్‌-3 శ్రీ మురళి బఘీర (తెలుగు) - 12.10 3.35 7.00 10.25
- స్క్రీన్‌-4 క (తెలుగు) - 11.45 6.30 9.45; అమరన్‌ (తెలుగు)-3.00
- లలితామహల్‌ దేవర పార్ట్‌-1(తెలుగు)
- దేవి లక్కీ భాస్కర్‌ (తెలుగు)
- నటరాజ్‌ అమరన్‌ (తెలుగు)
- విజయ్‌ క (తెలుగు)

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్‌	81,900	వెండి(కిలో)	1,03,000
22 క్యారెట్స్‌	75,572		

– నిజామాబాద్‌ బిజినెస్‌

మాంసం ధరలు

చికెన్‌	ధరలు (కిలోకు)	డ్రెస్డ్‌	200
		లైవ్‌	140
స్కిన్‌లెస్‌	240	మటన్‌	800